ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికం 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 21, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 80, సొరకాయ 7, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

నూతన సీఎస్‌ను కలిసిన బీసీ సంఘం నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ నేతృత్వంతో బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వ నూతన సీఎస్ కె.రామకృష్ణారావును సచివాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఫీజు బకాయిల విడుదలలో తీవ్ర జాప్యం వలన ప్రైవేట్ కాలేజీల్లో డిగ్రీ పరీక్షలను యజమానులు బహిష్కరించారని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. బూర శ్రీనివాస్‌గౌడ్, గోదా రవీందర్ పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న కోట నీలిమా, విశాల్ సూదం

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమా లబ్ధిదారులకు సోమవారం సన్న బియ్యం పంపిణీ చేపట్టారు. అనంతరం సీనియర్ నేత విశాల్ సూదం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు విశాల్ సూదం, బబ్లూ, చిరంజీవి, మనీఫ్‌ఖాన్, కృష్ణ, మనోజ్, అడ్డూ, తస్లీమ్, మాధవి, అల్తమాష్, జగదీష్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కన్యకాపరమేశ్వరి జయంతి

నల్లకుంట: ఆర్యవైశ్య సంఘం నల్లకుంట ఆధ్వర్యంలో బుధవారం (నేడు) బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సంఘం ప్రధాన కార్యదర్శి గజవాడ అంజన్‌కుమార్ గుప్తా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాబా మందిరం మొదటి అంతస్తులో ఉదయం 9 గంటలకు పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ

ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్



పాదయాత్ర చేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు

రసూల్‌పురా: రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ పని చేస్తోందని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో అన్నానగర్ నుంచి లీప్యాలెస్ వరకు మంగళవారం 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పాదయాత్రలో సికింద్రాబాద్ జిల్లా టీపీసీసీ పరిశీలకుడు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ పరిశీలకుడు రాచమల్ల సిద్దేశ్వర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను నిత్యం అవమానిస్తున్నదన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే ప్రస్తుతం సామాన్యులకు సైతం సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, టీపీసీసీ సెక్రటరీ రాజేశ్‌యాదవ్, శాంసన్ రాజు, ఉత్తరయ్య మహేశ్, జమీల్, సంతోష్‌యాదవ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ ఇలా.. వెళ్లేదెలా..?

ట్రాఫిక్ టైమర్‌కు అడ్డుగా లైట్ పోల్



టైమర్‌కు అడ్డుగా ఉన్న లైట్ పోల్

బొల్లారం: లోతుకుంట చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్ స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లైట్ పోల్ వెనుక భాగంలో ట్రాఫిక్ టైమర్ ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనదారులకు అది సరిగా కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే తలసాని దంపతుల ప్రత్యేక పూజలు



ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని, స్వర్ణ దంపతులు

అమీర్‌పేట: పెళ్లి రోజు సందర్భంగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆయన సతీమణి స్వర్ణ దంపతులు మంగళవారం బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఉదయం ఆలయంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజలు చేసిన అనంతరం పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే పలువురు ఎమ్మెల్యే దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఈటీ కృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు హనుమంత్‌రావు, అశోక్‌యాదవ్, కూతురు నర్సింహ, కట్టబల్‌రాం, గుడిగె శ్రీనివాస్ యాదవ్, నాగలక్ష్మి, అరుణ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో..

రాంగోపాల్‌పేట్: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, స్వర్ణ దంపతుల సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి ఆలయానికి వెళ్లగా పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తలసాని దంపతులు ప్రత్యేక పూజల్లో చేశారు. అనంతరం, పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఈవో మనోహర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అత్తిలి అరుణ, మల్లికార్జున్ గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, నాగులు, ఆంజనేయులు, సతీశ్, గణేశ్, సత్యనారాయణ, మహేశ్ యాదవ్, చంద్రప్రకాశ్, అరుణ్ భట్, కుమార్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు సక్రమంగా విధులకు హాజరవ్వాలి



మాట్లాడుతున్న సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి



హాజరైన కార్మికులు, వివిధ కాలనీల ప్రతినిధులు

సనత్‌నగర్: పారిశుద్ధ్య కార్మికులు సక్రమంగా విధులకు హాజరుకావాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి పేర్కొన్నారు. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఖైరతాబాద్ సర్కిల్ ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన చెత్త ట్రాలీ ఆటో కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్ని కాలనీల్లో 2, 3 రోజుల వరకు చెత్తను తీయడం లేదని, అలాగే సమయ పాలన పాటించడం లేదని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సెలవు రోజు మినహా మిగితా రోజుల్లో తప్పనిసరిగా విధుల్లో ఉండేలా చూడాలని ఏఎంఓహెచ్‌కు సూచించారు. డివిజన్‌లో 152 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులకు 98 మంది మాత్రమే ఉన్నారని, అందులోనూ కొంతమంది వివిధ కారణాలతో సెలవులు పెడుతుండడంతో చాలాచోట్ల చెత్తను సేకరించడం లేదన్నారు. అలాంటి పరిస్థితి లేకుండా చూడాలన్నారు. అయితే కొన్ని ఆటో ట్రాలీలకు రిపేరు చేయాల్సిన ఉన్నాయని చెప్పగా, కాలనీ అసోసియేషన్లు ముందుకువచ్చి రిపేరు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు మీర్జా ఖలీల్‌బేగ్, నోమనుద్దీన్, జమీర్, పురుషోత్తం, షమీవుల్లా, నాగరాజు, జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్లు అరవింద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మాక్ డ్రిల్‌లో విద్యార్థులు పాల్గొనాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్న సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్‌లో విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొనాలని ఏబీవీపీ నగర కార్యదర్శి పృథ్వీతేజ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాలో ఇటీవల 28 మంది పౌరులను హతమార్చిన ఉగ్రవాదులకు పాక్ అండదండలు ఉన్నాయని పేర్కొన్నారు. పాక్‌తో యుద్ధం అనివార్యం అయితే విద్యార్థులు, యువత సిద్ధంగా ఉండేందుకు ప్రతిఒక్కరూ మాక్ డ్రిల్ శిక్షణ పొందాలని పేర్కొన్నారు.

9న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

బంజారాహిల్స్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కన్స్యూమర్ గ్రీవెన్సెస్ సమావేశం ఈ నెల 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు నిర్వహిస్తున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ సబ్ డివిజన్ ఏడీఈ జి.రమేష్ తెలిపారు. సమావేశానికి సీజీఆర్‌ఎస్ చైర్‌పర్సన్, టెక్నికల్ సభ్యులు, ఫైనాన్స్ సభ్యులు, విద్యుత్ వినియోగదారుల సభ్యులు హాజరవుతారన్నారు. వినియోగదారులు దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలతో పాటు బిల్లుల్లో హెచ్చు తగ్గుల విషయంపై కూడా ఫిర్యాదు చేసి పరిష్కారం చేసుకోవచ్చు. అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో ఆరోగ్య కేంద్రం ప్రారంభం



బంజారాహిల్స్: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రెనోవా హాస్పిటల్స్ సంయుక్తంగా విశ్వవిద్యాలయంలో ఆరోగ్య కేంద్రాన్ని ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలను అందించేలా కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆరోగ్యం, విద్య, వెల్‌నెస్ కార్యక్రమాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. రెనోవా హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ ఎల్.విజయారెడ్డి, డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

'మావోయిస్టులు ఆయుధాలు వీడి లొంగిపోవాలి'

ఉస్మానియా యూనివర్సిటీ: మావోయిస్టులు ఆయుధాలు వీడి లొంగిపోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రామచర్ల రాంబాబు అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట మావోయిస్టుల దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరిట అమాయకపు గిరిజన ప్రజలను చంపుతున్నారని, మావోయిస్టులతో చర్చలు జరపాలని సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ కోరడం విచారకరమన్నారు. తుపాకీ ద్వారా రాజ్యాధికారం వస్తుందని తప్పుడు సిద్ధాంతంతో ఇంతకాలం అనేక మంది పోలీసులను, ప్రజాప్రతినిధులను, అధికారులను, ఇన్ఫార్మర్ల పేరిట సామాన్య ప్రజలను హతమార్చిన మావోయిస్టుల ఉద్యమం చివరకు బలహీన పడిందన్నారు. కేంద్ర బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పోలీసులు పై చేయి సాధించగానే వారు శాంతి చర్చల జపం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధికి అడ్డుగా ఉన్న మావోయిస్టులను ఏరివేస్తున్న కేంద్ర బలగాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి పృథ్వీతేజ, జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, పగిడిపల్లి శ్రీహరి, అలివేలి రాజు, కమల్ సురేశ్, హరిప్రసాద్, ఓయూ నాయకులు దృహన్, తోట శ్రీనివాస్, శంకర్, కోటి, శ్రీధర్, నరేందర్, మనీశ్, అన్వేశ్, సాయి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, నిందితులు

బంజారాహిల్స్: వేర్వేరు ఘటనల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన ఐదుగురిని టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురిని జువైనల్ కోర్టులో హాజరుపర్చారు. వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సింగాడికుంటకు చెందిన మొహమ్మద్ అజారుద్దీన్ మెకానిక్. ఈజీగా డబ్బులు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తుంటాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హోండా డ్యూయో వాహనాన్ని చోరీ చేసిన ఓ మైనర్ దానిని రూ.10 వేలకు అమ్మేశాడు. వచ్చిన డబ్బులతో జల్సా చేశాడు.

- ఇదేవిధంగా బోయిన్‌పల్లికి చెందిన మొహమ్మద్ ఫిరోజ్, మహ్మద్ సమీర్‌లు ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తుంటారు. బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో హోండా డ్యూయో వాహనాన్ని చోరీ చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు.
- పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే మొహమ్మద్ షాదాబ్, రిజ్వాన్ రెండు ద్విచక్ర వాహనాలను చోరీ చేసి ముర్తుజా అనే వ్యక్తికి అమ్మేశాడు. ముర్తుజా ఇద్దరు మైనర్లకు అమ్మేశాడు. పోలీసులు అజారుద్దీన్, మొహమ్మద్ ఫిరోజ్, మొహమ్మద్ సమీర్, మొహమ్మద్ షాదాబ్, ముర్తుజాను అరెస్టు చేశారు. రిజ్వానా పరారీలో ఉన్నాడు. ముగ్గురిని జువైనల్ కోర్టులో హాజరుపర్చారు.